మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# నాగర్‌కర్నూల్ జిల్లాకు డిజిటల్ గ్రంథాలయాలు

- ఎంపీ మల్లు రవి ప్రత్యేక చొరవ
- రూ.1.20 కోట్ల సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు
- కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** గ్రామీణ స్థాయిలో విద్యార్థులు, ప్రజలకు విజ్ఞానం పెంపొందించేందుకు, చైతన్యం కల్పించేందుకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా.మల్లు రవి ప్రత్యేక చొరవతో జిల్లాలో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాలో ఈ మేరకు సిఎస్ఆర్ నిధుల ద్వారా రూ.1 కోటి 20 లక్షలు నిధులతో మొత్తం 50 డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాట్లు చేయనున్నట్లు, నాగర్‌కర్నూలు జిల్లాలో 29 డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు జరగనున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో డిజిటల్ గ్రంథాలయాల నూతన భవనాల నిర్మాణాలు, గ్రంథాలయాల ఏర్పాట్లకు కావాల్సిన స్థల సేకరణపై సమీక్షా సమావేశంలో కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 29 డిజిటల్ గ్రంథాలయాల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఒక్కో గ్రంథాలయ నిర్మాణానికి రూ.2 లక్షలు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు.నియోజకవర్గాల వారీగా గ్రంథాలయాల ఏర్పాటుకు -మిగతా4లో..



కలెక్టర్ బాదావత్ సంతోష్



జడ్చర్ల మున్సిపల్ కార్యాలయం సమీపంలో కుక్కల స్వైరవిహారం

## ప్రాణాలు పోతేనే..
# స్పందిస్తారా..?

- కావేరమ్మపేట ఘటనతోనైనా మేలుకోరా..
- జడ్చర్లలో తీవ్రమైన కుక్కల బెడద
- ఎమ్మెల్యేగారు మీరైనా పట్టించుకోండి..
- భయాందోళన చెందుతున్న తల్లిదండ్రులు

**జడ్చర్ల, సెప్టెంబరు23, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీలో కుక్కల బెడద తీవ్రమైంది. గత వారం కావేరమ్మపేటలో ఒకే కుక్క 17మందిపై దాడి చేయడంతో ఒక్కసారిగా పట్టణవాసులు ఉలికిపడ్డారు. 15 మందికి స్వల్పంగా గాయాలు కాగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయాలపాలు కావడంతో దవాఖానలో అడ్మిట్ అయ్యారు. అయితే అదే సమయంలో చిన్నారులు అక్కడ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని చెప్పవచ్చు. ఏ కాలనీలో చూసినా పదుల సంఖ్యలో శరకాలు ప్వైరవిహారం చేయడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నది.

**ఆందోళన చెందుతున్న ప్రజలు..**

కావేరమ్మ పేట ఘటనతో అయినా అధికారుల్లో చలనం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. కుక్కలు అనగానే ఇప్పుడు భయం పుట్టుకొస్తున్నది. జడ్చర్ల మున్సిపాలిటీలో శునకాలతో జనాలు ఇబ్బంది పడతున్నారు. పట్టణంలో గుంపులుగా కుక్కలు సంచరిస్తూ జనాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. చిన్న పిల్లలను బయటికి పంపాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. ఇప్పటికి పట్టణంలో జరిగిన దాడుల్లో ఎక్కడా కూడా ప్రాణనష్టం జరగలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కుక్కలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు వీధి కుక్కలను తరలించాలని కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని వేడుకుంటున్నారు.

**చాలా భయంగా ఉంది..**



మాది పద్మావతి కాలనీ. చుట్టూ నాలుగు పాఠశాలలు ఉన్నాయి. కుక్కలు పదుల సంఖ్యంలో తిరుగుతున్నాయి. అందరూ చిన్నపిల్లలే ఉన్నారు. బయటకు పంపాలన్నా భయం వేస్తున్నది. అధికారులు పట్టించుకోవడం లేదు. ఇంటి చుట్టుపక్కల కూడా అంతా చెత్తాచెదారం పేరుకుపోయింది. పాములు వస్తున్నాయి.

**– రమా, పద్మావతి కాలనీ, జడ్చర్ల**

## వచ్చే జూన్ నాటికి
# కరివెనకు కృష్ణా జలాలు



కరివెన ప్రాజెక్టును చీఫ్ ఇంజనీర్‌తో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

- కాల్వల నిర్మాణానికి త్వరలో భూసేకరణ
- ప్యాకేజీల పనుల పూర్తికి రూ.450కోట్ల నిధులు అవసరం
- చీఫ్ ఇంజనీర్‌తో కలిసి కరివెన ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి

**భూత్పూర్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** వచ్చే ఏడాది జూన్ నాటికి కరివెన కురుమూర్తిరాయ ప్రాజెక్టు ద్వారా దేవరకద్ర నియోజకవర్గంలో సాగుకు నీళ్లందిస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి స్పష్టం చేశారు.ఎమ్మెల్యే జీఎంఆర్ మంగళవారం కరివెన ప్రాజెక్టు వద్ద సంబంధిత నీటిపారుదల శాఖ ఇంజినీర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ 13, 14,15 ప్రాజెక్టు ప్యాకేజీల పనులకు రు.450 కోట్ల నిధులు అవసరమని సమీక్షలో అధికారులు తెలిపారని ఎమ్మెల్యే జీఎంఆర్ అన్నారు.గత ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ 2015 జూన్ 11న కరివెన రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేస్తూ మూడేళ్లలో పాలమూరు-రంగారెడ్డి పనులను కుర్చీ వేసుకుని మరీ పూర్తిచేస్తానని అన్నారని పేర్కొన్నారు.పదేళ్ల అధికారంలో ఉండి పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు పనుల్ని బీఆర్ఎస్ పూర్తి చేయలేక పోయిందని ఎమ్మెల్యే జీఎంఆర్ విమర్శించారు.పనులు కాకముందే మాజీ సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు 600 ఎద్దుల బండ్లతో ఆర్భాటంగా నార్లాపూర్ వద్ద మోటార్ ఆన్ చేసి అరగంటకే స్విచ్ ఆఫ్ చేశారని విమర్శించారు. ప్రాజెక్టు పనులు పూర్తికానందునే మోటార్లు ఆఫ్ చేశారన్నారు. పాలమూరు ప్రాజెక్టును పడావ్ పడేసి నాటి పాలకులు తమ సొంత లాభాలపైనే దృష్టిని సారించారని ఎమ్మెల్యే జీఎంఆర్ ఆరోపించారు.ప్రాజెక్టు కాంట్రాక్ట్ చేసిన మాజీ ఎమ్మెల్యే ఇక్కడి చెర్వులలో మట్టిని తరలించి వందల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు.నీటిని దేవరకద్ర నియోజకవర్గంలోని భూత్పూర్, అడ్డాకుల,మూసాపేట,దేవరకద్ర మండలాల్లోని 46 వేల ఎకరాలకు కాల్వలద్వారా సాగునీరు వస్తుందని,కోయిల్‌సాగర్ కుడి, ఎడమ కాల్వల చివరి ఆయకట్టు స్థిరీకరణ అవుతందని ఎమ్మెల్యే జీఎంఆర్ పేర్కొన్నారు.కాల్వల నిర్మాణాలకు త్వరలో భూసేకరణ చేపట్టి వచ్చే ఏడాది జూన్ నాటికి సాగునీరందిస్తామని తెలిపారు.గత ప్రభుత్వం సాగునీరు సరఫరాకు కాల్వల నిర్మాణాలకు భూసేకరణ చేపట్టలేనందునే ప్రస్తుతం కాల్వల నిర్మాణాలకు జాప్యమేర్పడుతోందన్నారు. కాల్వల నిర్మాణాలకు ఆనాడే భూసేకరణ చేసి ఉంటే ఇంత జాప్యం జరగకుండేదని ఎమ్మెల్యే జీఎంఆర్ అన్నారు.కాల్వల కోసం భూసేకరణ చేస్తే కమీషన్లు రావనే నాటి పాలకులు భూసేకరణ చేయలేదని ఎమ్మెల్యే జీఎంఆర్ ఆరోపించారు.ప్రాజెక్టు పనులకు రు.39వేల కోట్ల నిధులు మంజూరు కాగా,ఇంతవరకు ప్రాజెక్టుకు రు.29 వేల కోట్లు వెచ్చించారని, మిగిలిన రు.10కోట్లకు అదనంగా మరో యాభైవేల కోట్ల నిధులు అవసరమని పేర్కొన్నారు.తమ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి దశ నిర్మాణానికి కట్టుబడి ఉందని – మిగతా4లో..



ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్



దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు ఐదో శక్తిపీఠం జోగుళాంబ ఆలయంలో అమ్మవారు భక్తులకు బ్రహ్మచారిణిగా దర్శమిచ్చారు. (అలంపూర్ , సెప్టెంబరు23,ప్రభాతవార్త)

## బాలికల సంరక్షణ, విద్యపై
# ప్రత్యేక దృష్టి పెట్టాలి

- బాల్య వివాహాలు జరుగకుండా పకడ్బందీగా చర్యలు
- పిల్లలు, మహిళలకు పౌష్టికాహారం పై అవగాహన కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలి
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

2

# తాను లేకున్నా.. మరొకరికి చూపునిచ్చి..

- నేత్ర దానం చేసిన జ్యోతి



# ఉగ్ర కృష్ణమ్మ..

- శ్రీశైలానికి 4లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 10గేట్లు 14అడుగులు ఎత్తి సాగర్‌కు నీటివిడుదల
- 882.90 అడుగులకు చేరుకున్న నీటిమట్టం
- జూరాల 45గేట్లు ఎత్తివేత

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 23, ప్రభాతవార్తః** కృష్ణమ్మకు ఉగ్రరూపం దాల్చుతున్నది. దీంతో కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. శ్రీశైలం,జూరాల, నాగార్జున సాగర్ డ్యాంలు నిండుకుండలను తలపిస్తున్నాయి. మంగళవారం సాయంత్రం 6గంటల సమాచారం మేరకు డ్యాం నీటిమట్టం 885అడుగులకు గాను 882.90అడుగులకు చేరింది. డ్యాం సామర్థ్యం 215.8070టీఎంసీలకు 203.8907టీఎంసీలకు చేరింది. జలాశయానికి జూరాల వపర్‌హౌజ్ ద్వారా 25,676క్యూసెక్కులు,స్పిల్‌వే ద్వారా 3,14,595క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 17784క్యూసెక్కులు,హంద్రీ నుంచి 250క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. శ్రీశైలం జలాశయంలోని ఎడమ,కుడి విద్యుదుత్పత్తి కేంద్రాలకు 65,482క్యూసెక్కులు విడుదల చేశారు. డ్యాం 10గేట్లు 14అడుగులు ఎత్తి 3,49,620క్యూసెక్కుల వరద దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి మొత్తంగా 3,98,815క్యూసెక్కుల వరద నాగార్జున సాగర్‌కు విడుదల అవుతున్నది. జూరాలకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల గేట్లు ఎత్తివేశారు.దీంతో పాలమూరు వరప్రదాయిని జూరాలకు వరద క్రమంగా పెరుగుతున్నది. ప్రాజెక్టుకు 2,96,000ఇన్‌ఫ్లో నమోదు కాగా, 45గేట్లు ఎత్తి దిగువకు 3,14,595క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పవర్‌హౌజ్‌కు 25,676క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.944టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. జూరాల ఎడమ కాలువకు 390, కుడి కాలువకు 580క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తంగా అవుట్‌ఫ్లో 342060క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



4

# ధాన్యంలో తేడా వస్తే డీటీలపై చర్యలు

- మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ సమర్పించాలి
- సమీక్షలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం

## రైల్వే బ్రిడ్జిలు..
# నిర్మించండి

- ప్రజల ఇబ్బందులను తీర్చండి..
- కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం
- మహబూబ్‌నగర్ లో రైల్వే సమస్యలపై వినతి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు23, ప్రభాతార్త;** మహబూబ్ నగర్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం చేపట్టాలని మహబూబ్ నగర్ ఎంపి డికె అరుణ నేతృత్వంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను న్యూఢిల్లీలోని వారి కేంద్ర కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. మహబూబ్‌నగర్ నగరం పరిధిలో ఉన్న రైల్వే గేట్ల వల్ల ఏర్పడే భారీ వాహనాల రద్దీ కారణంగా పౌరులకు అసౌకర్యం కలుగుతుంది అని వారు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న రద్దీ కారణం ప్రజలు వారి నిత్య కార్యకలాపాలు అత్యవసర కార్యకలాపాలకు పెద్ద అడ్డంకి మారిందని, సరైన రోడ్డు, రైలు విభజన లేకపోవడం వల్ల నగరం మొత్తం రద్దీగా ఉంటుందని, అనేక కిలోమీటర్ల వరకు తీవ్రస్థాయి ట్రాఫిక్ జాములు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయం వెళ్లే వారు వ్యాపారులకు రోజువారీగా అసౌకర్యం ఏర్పడుతుందని మంత్రి దృష్టికి తీసుకుపోయారు. ఎక్కువ సమయం రైల్వే గేట్లు మూసి ఉండటం వల్ల అంబులెన్స్, అత్యవసరం ప్రయాణాలు సైతం ఆలస్యం అవుతుందని దీనివలన చాలా కాలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిలు లేకపోవడం వలన నగరంలో మొత్తం ప్రభావం చూపుతుంది అని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్ నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలు తీరాలంటే వెంటనే, అత్యవసరమైన తిరుమల దేవుని గుట్ట రైల్వే గేటు, బోయపల్లి రైల్వే గేటు, తిమ్మసానిపల్లి రైల్వే గేట్లలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిలను 100 కేంద్ర ప్రభుత్వ నిధులతో త్వరితగతిన నిర్మాణం చేయాలని మంత్రిని కోరారు. అలాగే సద్దల గుండు, దివిటిపల్లిలో పాదాచారుల కోసం ఓవర్ బ్రిడ్జిలు కూడా ఏర్పాటు చేయడం వలన ప్రజలకు మేలు జరుగుతుందని మంత్రి దృష్టికి తీసుకురాగా, నగరంలో కేంద్ర నిధులతో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిలను మరియు పాదాచారుల ఓవర్ బ్రిడ్జిలను నిర్మించేందుకు మంత్రి సుముఖంగా స్పందించారని, కేంద్ర ప్రభుత్వ నిధులతో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణాలు చేస్తామని ఎంపి, ఎమ్మెల్యే లకు ఆయన హామీ ఇచ్చారు.




మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లా అధికారులతోపాటు కలెక్టరేట్ సిబ్బంది బొడ్డెమ్మలు వేసి సంబురాలు చేసుకున్నారు. కలెక్టర్ విజయేంద్ర బోయి అధికారులు, మహిళా సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు.

# ఆర్అండ్ఆర్ సమస్యలు పరిష్కరిస్తాం

**ర్యాలంపాడ్ నూతన పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి**

**గద్వాల టౌన్ సెప్టెంబర్ 23, ప్రభాతవార్త:** ర్యాలంపాడ్ నూతన పునరావాస కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో పునరవాస కేంద్రం లో నెలకొన్న సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానని, ఇందిరమ్మ ఇళ్లు వచ్చిన వారందరూ ఇందిరమ్మ ఇండ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడి పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. అతి తొందరలో పునరావాస కేంద్రం ఆర్ అండ్ ఆర్ సెంటర్ లో వున్న సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, నాగన్న, పంచాయతీ కార్యదర్శి, విజయ్, పురుషోత్తం రెడ్డి, రంగన్న, రంగ రెడ్డి, అంపన్న, తిమ్మప్ప, నర్సింహులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆర్అండ్ఆర్ సెంటర్ ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల

# డెంగీపై దృష్టి సారించాలి

- అమ్మాయిల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్న స్వస్త్ నారి సశక్త్ పరివార్ కార్యక్రమంపై మంగళవారం ఎన్.ఐ.సి హాల్లో జిల్లా కలెక్టర్ వైద్య శాఖ పై సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారిగా ఇప్పటి వరకు ఎంత మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు, స్పెషలిస్ట్ వైద్యులు ఎవరెవరు వచ్చారు అనే వివరాలను అడిగారు. స్వస్త్ నారి సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 10వేల పైచిలుకు వరకు పిల్లలు, మహిళలు ప్రత్యేక వైద్య పరీక్షలకు హాజరయ్యారని, రోజుకో స్పెషలిస్ట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి హాజరై వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య అధికారి సమాధానం ఇచ్చారు. స్పెషలిస్ట్ డాక్టర్ వచ్చే ముందు రోజు ప్రజలకు సమాచారం ఇచ్చి వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు. వనపర్తి హెల్త్ పోర్టల్‌లో రోగుల వివరాలు నిక్షిప్తం చేసి వారికి సంక్షిప్త సందేశం వెళ్లే విధంగా వారి సరైన వాట్సప్ నెంబర్లు పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు విధిగా ఆభా కార్డు రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. జిల్లాలో ఈ సంవత్సరం 63డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయని, డెంగ్యూ వచ్చిన ప్రాంతంలో ప్రత్యేక దృష్టి పెట్టి ఎంపీడీఓ, మున్సిపల్ – మిగతా4లో..



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

## బాలికల సంరక్షణ, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**బాల్య వివాహాలు జరుగకుండా పకడ్బందీగా నియంత్రణ చర్యలు**

**పిల్లలు, మహిళలకు పౌష్టికాహారం పై అవగాహన కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** పోషణ మాసం, బేటిబచావో బేటి పడావో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లా సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు 17 నుండి అక్టోబర్ 2 వరకు జిల్లాలో నిర్వహిస్తున్న పోషణ మాసం కార్యక్రమం అదే విధంగా బేటి బచావో బేటి పడావో కార్యక్రమాలకు సంబంధించిన గోడపత్రికలను కలెక్టర్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా సంక్షేమశాఖ అధికారి, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. పిల్లలు, మహిళలకు పౌష్టికాహా రం, లోపంవల్ల జరిగే అనర్థాలపై కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. 18 సంవత్సరాల లోపు ప్రతి అమ్మాయి చదువులోనే కొనసాగే విధంగా చూడాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహించే పరిస్థితులు ఉంటే ముందే అరికట్టే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, పిడి డీఆర్డీఓ ఉమా దేవి, డిసిపిఒ రాంబాబు, సిడిపిఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాతమొల్గరలో ఎమ్మెల్యే జీఎంఆర్‌కు వినతులు



ఎమ్మెల్యే జీఎంఆర్‌కు వినతులు సమర్పిస్తున్న ప్రజలు,నాయకులు,కార్యకర్తలు

**భూత్పూర్,సెప్టెంబర్ 23,ప్రభాతవార్త :** దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్)కు మంగళవారం పలు గ్రామాల ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు వినతులు సమర్పించారు. మంగళవారం ఎమ్మెల్యే జీఎంఆర్ భూత్పూర్ మండలం పాతమొల్గర గ్రామానికి వచ్చిన సందర్భంగా పలు గ్రామాల ప్రజలు,పార్టీ నాయకులు,కార్యకర్తలు ఎమ్మెల్యే జీఎంఆర్‌ను స్వయంగా కలిసి తమ గ్రామాలకు సంబంధించిన సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి వినతులు సమర్పించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జీఎంఆర్ సమస్యల సత్వర పరిష్కారానికి కృషిచేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌గౌడ్‌తో పాటు కప్పెట వడ్డె శ్రీనివాసులు, కిట్టు రెడ్డి, టీవీ రెడ్డి, తమన్నగౌడ్, దెంది లక్ష్మీకాంత్‌రెడ్డి, తాటికొండ రవీందర్‌రెడ్డి, మాసగౌడ్, లక్ష్మయ్య, రాంరెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు గాలికొదిలేసిన కాంగ్రెస్

**ఊట్కూర్, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** యాసంగి పంటపై కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని ఘనంగా హామీ ఇచ్చినా, ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా అందకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హామీ ఇచ్చి అమలు చేయకపోవడం రైతులను తీవ్ర నిరాశలోకి నెట్టిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు ఊట్కూర్ వ్యవసాయాధికారి (ఎ.ఓ) గణేష్ రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడం రైతుల జీవితాలతో ఆటలాడటమేనని మండిపడ్డారు. వెంటనే బోనస్ మంజూరు చేసి, యాసంగి రైతుల పక్షాన నిలవాలని కోరుతూ ఎఓ కి వినతి పత్రం అందజేశారు. రైతు కోరం శివరాజ్ మాట్లాడుతూ, ప్రతి ఎన్నికల సమయంలో మమ్మల్ని మోసం చేస్తున్నారు. హామీలు ఇస్తారు కానీ అమలు మాత్రం చేయరు. మాకు అతి కష్టకాలంలో డబ్బు అవసరం ఉన్నప్పుడు బోనస్ ఇవ్వకపోవడం అన్యాయం" అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు మోట్కూర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, బోనస్ కోసం ఎంతకాలం ఎదురుచూడాలి? ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోకపోతే మేము ఉద్యమం చేపట్టక తప్పదు" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు కోరం శివరాజ్, బడ్కల్ అశోక్, మోట్కూర్ వెంకట్ రెడ్డి, కుర్వ సిద్ధప్ప, కుర్వ అశోక్, మోట్కూర్ సంతోష్ రెడ్డి, వీరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీ దేవి రూపంలో అమ్మవారు



పూజలో పాల్గొన్న భక్తులు

**మల్దకల్ సెప్టెంబర్ 23 ప్రభాతవార్త ;**జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని భక్త మార్కండేయ దేవాలయంలో మొదటిసారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండవ రోజు మంగళవారం అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. పద్మశాలి కులబాంధవుల ఆధ్వర్యంలో అభిషేకం, విశేష పూజలు నిర్వహించి అమ్మవారికి పులిహోర నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం మహిళా మణులచే సామూహిక కుంకుమార్చన, భక్తి గీతాలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిపామని భక్త మార్కండేయ ఆలయకమిటీఅధ్యక్షులు దామనరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కులభాండవులు, పిల్లలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేశారని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## పత్తి పంటలను పరిశీలించిన అధికారులు

**వడ్డేపల్లి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం కొంకల గ్రామంలో మంగళవారం రైతు వేదిక నందు డ్రాగన్ ఫ్రూట్ పంట యొక్క సాగు వివరాలు గురించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు తెలియజేయడం జరిగింది. అదేవిధంగా గ్రామంలోని పత్తి పంటలను, పంట నమోదు కార్యక్రమాన్ని అధికారులు పరిశీలించి రైతులకు తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. అందులో భాగంగా డిస్టిక్ అగ్రికల్చర్ ఆఫీసర్ సక్రియ నాయక్ అధిక వర్షాల కారణంగా నష్టపోయిన పత్తి పంటను పరిశీలించి తగు సూచనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ ఆఫీసర్ సక్రియ నాయక్, మండల వ్యవసాయ అధికారి జె. రాధ, వ్యవసాయ విస్తరణ అధికారులు కె.విమల, సి. వినోద్ కుమార్, గ్రామంలోని గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జిలతో వైద్యాధికారుల నిరసన

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** మహబూబాబాద్ ప్రభుత్వ కాలేజీ మరియు జనరల్ ఆసుపత్రిలో డా. వైద్య సిబ్బంది మీద జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం తెలంగాణ బోధన వైద్యుల సంఘం టిటి జిడిఏ నారాయణపేట యూనిట్ వారు ప్రభుత్వ వైద్య కళాశాల, జనరల్ ఆసుపత్రి నారాయణపేట నందు వైద్యులు, వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూఅపస్మారక స్థితిలో మరియు 60 కన్నా తక్కువ ఆక్సిజన్ శాతంతో వచ్చిన 65 ఏళ్ల రోగికి వైద్యం చేసి బ్రతికించడానికి ప్రయత్నించినందుకు బదులుగా వారి బంధువులు దాడులు చేయడం చాలా హేయమైన చర్యగా దీనిని టీటీజిడీఏ తీవ్రంగా ఖండించింది. వైద్యుడు ఏ రోగికి చెడు జరగాలని కోరుకోడు తనకు తెలిసిన వైద్య విజ్ఞానంతో ఉన్న సౌకర్యాలతో మంచి వైద్యాన్ని అందించడానికి చూస్తారని వైద్యులు తెలిపారు. నిరసన చేపట్టిన వారిలో వైద్య సిబ్బందితో పాటు తదితరులు ఉన్నారు.

## పీయూలో శ్రమదానం

**మహబూబ్‌నగర్ , సెప్టెంబరు23,ప్రభాతవార్త :** పాలమూరు విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ 4వ యూనిట్ వలంటీర్సు శ్రమదానం నిర్వహించారు. పాలమూరు విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ రెసిడెన్స్ పరిసరాలు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కే ప్రవీణ, చీఫ్ వార్డెన్, వైస్ ప్రిన్సిపాల్ పీజీ కాలేజ్ ఎం కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం. గాలేన్న, డాక్టర్ బి పర్వతాలు అసిస్టెంట్ ప్రొఫెసర్ డిపార్ట్మెంట్ ఆఫ్ సోషల్ వర్క్, డాక్టర్ రవీందర్ గౌడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ తెలుగు శాఖ పాలమూరు యూనివర్సిటీ ఎం ఎస్ డబ్ల్యూ వలంటీర్స్ 50 మంది పాల్గొన్నారు.

## కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన రాజ్ కుమార్ రెడ్డి

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** శరీర దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి కరాటే శిక్షణ ఎంతగానోదోహదపడుతుందని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె.రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణపేటలోని కేశవ్ మాస్టర్ కరాటే అకాడమీ ఇంటర్నేషనల్ కు చెందిన కరాటే విద్యార్థులు ముంబై భీమండిలోని పద్మశాలి ఫంక్షన్ హాల్ లో జరిగిన కరాటే టోర్నమెంట్ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో ఐదుగురు మొదటి బహుమతి పొందారు. ఇందులో కరాటే విద్యార్థులు రాకేష్, ఆరాధ్య, భాను, శివశంకర్, భవనేష్ లు బహుమతులు సాధించారు. పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులను భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె.రాజ్ కుమార్ రెడ్డి నారాయణపేటలో అభినందించి మెడల్స్, సర్టిఫికేట్లను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగాల్లో రాణించాలని సూచించారు. కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, కరాటే మాస్టర్ అశోక్ లను రాజ్ కుమార్ రెడ్డి అభినందించారు. క్రీడల్లో మరిన్ని పతకాలు సాధించి నారాయణపేటకు మంచి పేరు, ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనంద్, శ్రీదేవి, కరాటే విద్యార్థులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**వైద్య శిబిరంలో 36 మంది పిల్లలకు హృద్రోగ పరీక్షలు**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వైద్యులతో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

**వనపర్తి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** పుట్టుకతో వచ్చే హృద్రోగాలను ముందుగానే గుర్తించి, సమయానికి శస్త్రచికిత్స చేయించడం ద్వారా పిల్లలకు కొత్త జీవితం ఇవ్వవచ్చని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో సత్య సాయి హాస్పిటల్స్ (సిద్దిపేట జిల్లా) సహకారంతో ఆర్‌బిఎస్‌కే వైద్యాధికారుల ద్వారా గుర్తించిన కాంజెనిటల్ హార్ట్ డిసీజెస్ (పుట్టుకతో వచ్చే హృద్రోగ సమస్యలు) పై ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్‌బిఎస్‌కె సిబ్బంది హృద్రోగ సమస్యలు ఉన్న పిల్లలను గుర్తించి వైద్యం చేయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో 36 మంది పిల్లలకు హృద్రోగ పరీక్షలు నిర్వహించగా, వారిలో 15 మందికి హృదయ శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. వీరికి త్వరలోనే సిద్ధిపేట జిల్లా సత్యసాయి హాస్పిటల్లో ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సత్యసాయి ఆసుపత్రి హృద్రోగ వదిద్యుడు డా. జగన్నాథ శర్మ మాట్లాడుతూకాంజెనిటల్ హార్ట్ డిసీజెస్ అనేది పిల్లలు పుట్టినప్పటి నుంచే హృదయంలో ఉండే నిర్మాణ లోపం వల్ల వస్తుందని, ఇది హృదయంలోని రక్తనాళాలు, వాల్వులు లేదా గోడలలో ఉండే లోపాల వల్ల రక్తప్రసరణ సక్రమంగా జరగకపోవడం వలన ఉత్పన్నమవుతుందనీ అన్నారు. లక్షణాలు శిశువు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటంవేగంగా అలసిపోవడం పెరుగుదల మందగించడం పెదవులు, గోళ్ల నీలి రంగులోకి మారడం (సయానోసిస్) వంటి లక్షణాలు ఉన్నాయన్నారు. చికిత్స స్వల్ప లోపాలు ఉన్నవారికి సాధారణ మందులు లేదా పర్యవేక్షణ సరిపోతుంది. తీవ్రమైన లోపాలు ఉన్నవారికి శస్త్రచికిత్స అవసరం అవుతుంది. సమయానుకూలంగా చికిత్స పొందితే పిల్లలు ఆరోగ్యంగా సాధారణ జీవితం గడపగలుగుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీనివాసులు, జిల్లా ప్రోగ్రాం అధికారి డా. సాయినాథ్ రెడ్డి, డా. పరిమళ, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం వైద్యాధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెందొద్దు: డీసీసీబీ డైరెక్టర్



విక్రయం కేంద్రం వద్ద రైతులకు అవగాహన కల్పిస్తున్న డిసిసిబి డైరెక్టర్

**ఉప్పునుంతల, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** వర్షాకాలంలో సాగు చేసుకున్న పంటల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ వారు అందిస్తున్న యూరియా సరఫరా పట్ల రైతులలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు రైతులకు సూచించారు. మంగళవారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం కార్యాలయంలో యూరియా విక్రయ కేంద్రం వద్ద భారీగా రైతులు తరలిరావడం జరిగింది. ఇది గమనించిన డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు మాట్లాడుతూ కొంతమంది రైతులు వచ్చే యాసంగి పంటకు సరిపడు యూరియా వస్తుందో, లేదోనని ముందస్తు ఆలోచనతో కొంతమంది నిల్వ చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి ఆలోచన రైతులు పెట్టుకోవాల్సిన అవసరం లేదని ఆయన అవగాహన కల్పించారు. యూరియా సరఫరా లో ఎలాంటి ఇబ్బంది లేదని యాసంగి లో సాగు చేసుకున్న పంటలకు సరిపడు యూరియా రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ వ్యవసాయ శాఖ వారు సంయుక్తంగా రైతులకు సకాలంలో అందిస్తారని మీలో ఉన్న అపనమ్మకాన్ని తొలగించుకోవాలని ఆయన సూచించారు. యాసంగి పంటలో సరిపడు యూరియాతోపాటు నానో యూరియా సరఫరా చేస్తారని రైతులు ఎలాంటి బెంగ పడాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం వాన కాలంలో సాగు చేసుకున్న పంటలకు సరిపడు యూరియా వస్తున్న రైతులు ఆందోళనతో విక్రయ కేంద్రాల వద్దకు భారీగా తరలివస్తున్నారని ఇలా రావడం వల్ల సరఫరా చేసేవారికి చాలా ఇబ్బంది ఏర్పడుతుందని, రైతులు గమనించి యూరియా నిల్వ చేసుకునే ప్రయత్నం చేయకూడదని అవగాహన కల్పించారు. సంవత్సరం వర్షాకాలంలో వరి, పత్తి, మొక్కజొన్న పంట భారీగా సాగు చేసుకున్నారని ఇప్పటివరకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం, రైతు ఆగ్రో సేవా కేంద్రం, మన గ్రోమోర్ ద్వారా రైతులకు సరఫరా చేయడం జరిగిందని, యాసంగి పంటలో సాగు చేసుకున్న రైతులకు సరిపడు యూరియా సరఫరా చేసే విధంగా తాను సాయి శక్తుల చేస్తానని రైతులకు ఆమె ఇచ్చారు. డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు రైతులకు అవగాహన కల్పించడంతో కొంతమేరకు రైతులు యాసంగి పంట కోసం యూరియా నిల్వ చేసుకోకూడదని భావించి కొంతమంది వెనుతిరిగి వెళ్ళిపోయారు. రైతులకు అవగాహన కల్పిస్తున్న చైర్మన్ తో పాటు మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్, సంఘ సీఈఓ కొత్త రవీందర్ రావులు ఉన్నారు.

## ధాన్యం సేకరణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి : అదనపు కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాలటౌన్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త:** 2025.26 వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన వరిధాన్యం సేకరణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లాఅదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై వివిధశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీ గింజ కొనుగోలు చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు రైతుల వద్ద ధాన్యం కొనుగోళ్లు చేస్తామన్నారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లను అక్టోబర్ రెండో వారంలో ప్రారంభించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన అన్ని ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలని, ప్యాడీ క్లీనర్, వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, అవసరమైన గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఓ.పి.ఎం.ఎస్ లో నమోదు చేయాలని, అంతర్ రాష్ట్ర బోర్డర్స్ వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ఎదురైన ఇబ్బందులు, పొరపాట్లు మళ్లీ జరగకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంలో పనిచేసి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను సజావుగా కొన సాగించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ విమల, జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో శిక్షణ శిబిరం విజయవంతం: పిడి రమేష్



మాజీ ఎంపిటిసి భూరం మల్లేష్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

**ఉప్పునుంతల, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న 35వ సబ్ జూనియర్ జిల్లా స్థాయి కబడ్డీ శిక్షణా పొందుతున్న క్రీడాకారులకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పిడి రమేష్ అన్నారు. తమ గ్రామంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పిడి రమేష్ చేదోడు వాదోడుగా నిలిచిన గుడ్డటి బాలరాజు, ఉప్పరి బాలరాజ్, సమ్మద్ సయ్యద్, ఆర్థిక సహకారం అందిస్తూ శిక్షణ శిబిరం వద్ద ఉండి పర్యవేక్షిస్తున్న మాజీ సర్పంచ్ గుండె మోని లింగమయ్య యాదవ్, బూషి రాజ్ మల్లయ్య, పొన్నగంటి బాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాగి వేణుగోపాల్ రెడ్డి లు నిత్యం శిక్షణా శిబిరానికి దాతలు ముందుకు రావడంతో వారిని శాలువాలు కప్పి సన్మానించడం లో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని పిడి రమేష్ వివరించారు. ఇటువంటి వారి సహకారం ఉంటే భవిష్యత్తులో మరిన్ని క్రీడాకారులకు శిక్షణ శిబిరం నిర్వహించేందుకు తాము వెన్న అంటూ ఉంటామని భరోసా కల్పించారు. మంగళవారం పిరట్వాన్ పల్లి మాజీ ఎంపీటీసీ, వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి బూరం మల్లేష్ 5 వేలు, భూరం అనిల్ 2 వేలు, ఎండి ఖాదర్, గంట సతీష్ లు వెయ్యి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన వారికి ప్రత్యేకంగా అభినందనలతో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిడి రమేష్ తో పాటు మాజీ సర్పంచ్ గుండె మోని లింగమయ్య యాదవ్, పిరట్వాన్ పల్లి మాజీ ఎంపీటీసీ భూరం మల్లేష్ ,గంట శేఖర్, మల్లయ్య, కురుమయ్య యాదవ్, గుడ్డటి బాలరాజు, సమ్మద్, శిక్షణా పొందుతున్న క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు తప్పవు : ఏడిఏ

**మల్దకల్ సెప్టెంబర్ 23, ప్రభాతవార్త;** జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని మంగళవారం ఎరువుల, పురుగుమందులు విత్తనాలదుకాణాలను ఏడిఏ సంగీత లక్ష్మి, మండల వ్యవసాయ అధికారి కె.రాజశేఖర్ తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన ఎరువుల డీలర్స్ రైతులకి అవసరం మేరకు ఎరువులను అందుబాటులో ఉంచాలని, ఈ పాస్ మెషిన్ ద్వారానే అమ్మకాలు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఎరువులు ఎంఆర్పీ ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అదేవిధంగా మల్దకల్ పీఏసీఎస్ లో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు.

## తాను లేకున్నా.. మరొకరికి చూపునిచ్చి..

**- నేత్ర దానం చేసిన జ్యోతి**



**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 23,ప్రభాతవార్త:** మనం చనిపోతూ కూడా నలుగురు ఉపయోగపడేలా ఏదో ఒక పని చేయాలని ఆలోచించేవారు చాలా అరుదు. అలాంటి వారిలో మహబూబ్‌నగర్‌లోని ఏనుగొండకు చెందిన న్యాయవాది గంగయ్యకుమార్తె జ్యోతి(36) తనమరణానంతరం నేత్రదానం చేసి ఆదర్శంగా నిలిచారు. జ్యోతి తన నేత్రాలను దానం చేసి మరో ఇద్దరికి చూపును ప్రసాదించి స్ఫూర్తిగా నిలిచారు. అనారోగ్యకారణాలతో మంగళవారం మహబూబ్‌నగర్ తన నివాగృహంలో కనుమూసిన జ్యోతి కోరిక మేరకు ఆమె తండ్రి న్యాయవాది గంగయ్య ఈవిషయంగా సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజును సంప్రదించారు. ఈమేరకు వారు ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రికి చెందిన టెక్నీషియన్ శివకుమార్ సమాచారం అందించగా, జ్యోతి ఇంటికి చేరుకొని ఆమె నుంచి కార్నియాను సేకరించారు. అనంతరం జ్యోతి కుటుంబ సభ్యులు తండ్రి గంగయ్య, సోదరుడు జి.సాయి శ్రీనివాస్ యాదవ్, సోదరీమణులు అరుణ, శ్రీవాణిలకు కార్నియా సేకరించినట్లు టెక్నీషియన్ శివ ధృవ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది మనోహర్ రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజు మాట్లాడుతూ నేత్ర దానం చేసిన కుటుంబ సభ్యులను అభినందించారు. ఇప్పటి వరకు మహబూబ్‌నగర్ పట్టణంలో 212మంది నుంచి కార్నియాను సేకరించినట్లు నటరాజ్ తెలిపారు. నేత్ర దానం చేసేందుకు 9666900900కు సంప్రదించాలని కోరారు. ఇదిలా ఉండగా నేత్ర దానం చేసిన జ్యోతి కుటుంబ సభ్యులను పాలమూరు, మహబూబ్‌నగర్ లయన్స్ క్లబ్ సభ్యులు, న్యాయవాది కృష్ణయ్య లు ప్రత్యేకంగా అభినందించారు.

**డైల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని**

## ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోండి

**నారాయణపేటటౌన్, సెప్టెంబరు23 ప్రభాతవార్త:**నారాయణపేట పట్టణ మరియు కోస్గి పరిసర ప్రాంతాల ప్రజలు నేటి డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించడం జరిగిందని డిపో మేనేజర్ లావణ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తేదీ 24.09.2025న ఉదయం 11.00 గంటల నుండి 12.00 గంటల వరకు డైల్ యువర్ డియం కార్యక్రమము నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున ఈ అవకాశమును ప్రయాణికులు ఫోన్ నెంబర్ కు 73 82 826293కు ఫోన్ చేసి తగు సమస్యలు సలహాలు, సూచనలను తెలియజేయాలన్నారు. ఈ అవకాశమును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## భారత్‌మాలపై సమీక్ష



**మహబూబ్‌నగర్,సెప్టెంబరు23,ప్రభాతవార్త:** రెవెన్యూ అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ భారత్‌మాల రోడ్‌పై మహబూబ్‌నగర్ రూరల్, దేవరకద్ర, చిన్నచింతకుంట, కౌకుంట్ల మండలాల తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించారు. అలాగే ఓటర్ జాబితా పరిశీలించి, ఇతర రెవెన్యూ అంశాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ వారి సిబ్బందికి పనులు తొందరగా చేయాలని ఆదేశించారు.

**మాతా మన్నించు..!**

# కంచి కామాక్షి ఆలయంపై నిర్వాహకుల చిన్నచూపు..?

**నవరాత్రుల్లో కంచి కామాక్షి ఆలయాన్ని నిర్లక్ష్యం చేయడంపై భక్తుల ఆవేదన**



దర్శనం కొరకు వేచి ఉన్న భక్తులు

**అలంపూర్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** అలంపూర్ జోగులాంబ ఆలయ సమీపంలోని కంచి కామాక్షి ఆలయంపై దేవస్థానం అధికారులు చిన్నచూపు చూపుతున్నారని భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్త్రీశక్తి ఉత్సవాల ప్రతీకగా భావించే నవరాత్రి బ్రహ్మోత్సవాలు జోగులాంబ ఆలయంలో ఘనంగా జరుగుతుండగా, పక్కనే ఉన్న కంచి కామాక్షి ఆలయాన్ని పూర్తిగా విస్మరించడం సరికాదంటూ వారు మండిపడుతున్నారు. దేవస్థానం ప్రచురించే కరపత్రాలు, వాల్‌పోస్టర్లలో కూడా కంచి కామాక్షి ఆలయ ప్రస్తావన లేకపోవడంపై భక్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఆలయం తెరుచుకునే, మూసే సమయాలు, పూజల షెడ్యూల్ వివరాలు తెలిపే సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం పట్ల వారు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నవరాత్రులలో జోగులాంబ ఆలయంలో జరుగుతున్నట్లు కంచి కామాక్షి ఆలయంలోనూ ప్రతిరోజూ నవావరణ అర్చన్న జరపాలని, పూజా విధులను సక్రమంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో మరో ఎక్కడా లేని విధంగా జోగులాంబ ఆలయ ప్రాంగణంలోనే ఉన్న ఈ ప్రత్యేక ఆలయాన్ని వెలుగులోకి తీసుకురావాలని, భక్తుల ఆరాధనకు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. డిప్యూటేషన్ పై ఆలయ అధికారులు సుమారు పదిమందిని బయటినుంచి అర్చకులు పిలిపించారని మరి వారి చేత కామాక్షి ఆలయంలో ఎందుకు పూజలు చేయించడం లేదని ప్రశ్నిస్తున్నారు. రికార్డులలో లెక్కలు – వాస్తవంలో విస్మరకంచి కామాక్షి ఆలయానికి పూజల పేరిట ఖర్చులను రికార్డులలో భారీగా చూపిస్తున్నా, వాస్తవానికి ఈ ఆలయంలో ఉత్సవాలు జరగకపోవడంపై భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇంత పెద్ద నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో కనీసం ఈ ఆలయానికి లైటింగ్ డెకరేషన్ కానీ మామిడి తోరణాలు కానీ కట్టకపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇతర ఆలయాల మాదిరిగా ఆర్జిత సేవల టికెట్లు, హుండీలు ఈ ఆలయంలో కూడా ఏర్పాటు చేసి ఆలయానికి ఆదాయ వనరులు పెంపొందించాలని కోరుతున్నారు. చక్రం తిప్పుతున్న ఉద్యోగిపై ఆరోపణలుగత 18 ఏళ్లుగా ఆలయంలో అన్నీ తానై చూసుకుంటు న్న ఓ ఉద్యోగి తన భార్యను పూజారిగా నియమించి సుమారు 40వేల వేతనం ఇప్పించుకుంటున్నాడని భక్తులు ఆరోపిస్తున్నారు. అందరి ఉద్యోగులను సమావేశాలకు పిలుస్తూ పూజారిగా ఉన్న తన భార్యను పిలవకపోవడం, హాజరు పట్టికలో కూడా ఆమె సంతకాలు ఇతనే చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భక్తుల హెచ్చరితారక బ్రహ్మేశ్వర ఆలయంను నిర్లక్ష్యం చేసి ఇప్పటికే మతపరులకు స్వాధీనం చేశారని, ఇప్పుడు కంచి కామాక్షి ఆలయ రికార్డుల ఖర్చులు, సిబ్బంది వివరాలను బహిరంగం చేయాలని భక్తులు హెచ్చరిస్తున్నారు. ఆలయ ఈవో, పాలక మండలి వెంటనే స్పందించి కంచి కామాక్షి ఆలయాన్ని వెలుగులోకి తెచ్చి నిత్య పూజలు, ఉత్సవాలు నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. నాకు తెలియదు చర్యలు తీసుకుంటాను దీప్తి ఆలయ ఇఓ కంచి కామాక్షి ఆలయం గురించి నాకు తెలియదు. రేపటినుండి మావి డాకులు కట్టిస్తాను. ఇక్కడ కూడా నిత్యపూజలు సవ్యంగా జరిగేటట్టు చర్యలు తీసుకుంటాను. ఈవిషయాన్ని కమీషనర్ దృష్టికి తీసుకెళ్లి అనుమతులు తీసుకుంటానని తెలిపారు.



బ్రహ్మచారినిగా జోగులాంబ అలంపురం జోగులాంబ అమ్మవారి ఆలయంలో జరుగుతున్న దేవీ నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు జోగులాంబ అమ్మవారు బ్రహ్మచారిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రదోషకాలంలో సువాసినీ కుమారి పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా ప్రదోషకాలంలో జరిగే దర్బార్ సేవలకు భక్తుల సంఖ్య అంతంత మాత్రమే కనిపించింది.

# ధాన్యంలో తేడా వస్తే డీటీలపై చర్యలు

■ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ సమర్పించాలి : అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** రాబోయే ఖరీఫ్ 2025,26 సీజన్‌కు సంబంధించి వారి మిల్లింగ్ సామర్థ్యానికి అనుగుణంగా బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో రైస్ మిల్లర్లతో ఆయన సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ గ్యారంటీ సమర్పించకుంటే వారికి ధాన్యము కేటాయించడం జరగదని స్పష్టం చేశారు. అదేవిధంగా ఖరీఫ్, రబీ 2024,25 సీజన్‌లలోని సిఎంఆర్ పురోగతిని సమీక్షించి, గడువులోగా డెలివరీలను వేగవంతం చేయాలని సూచించారు. సిఎంఆర్ బకాయి ఎక్కువ ఉన్న మిల్లర్లందరు మిల్‌ను రెండు షిఫ్ట్‌లలో అనగా రోజుకి 16 గంటలు ఆపరేట్ చేయాలని వాటికి సంబందించిన కరెంటు బిల్‌లను వెరిఫై చేసి రిపోర్ట్‌లను పంపాలని పౌర సరఫరాల శాఖ డిటిలను ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటిలకు సిఎంఆర్‌ని ప్రతి రోజు మిల్లు యొక్క కెపాసిటీ ప్రకారం డెలివరీ చేయించేలా వారికి టార్గెట్‌ని నిర్ణయించారు. ఏ మిల్లులో అయినా ధాన్యం విషయంలో తేడా వస్తే సంబంధిత డిటిలపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించడం జరిగింది. సమావేశంలో జిల్లా పూర్వ సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, సంస్థ జిల్లా మేనేజర్ రవి నాయక్, పౌర సరఫరా శాఖ డీటీలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

**లింగాల, సెప్టెంబరు23 ప్రభాతవార్త:** ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన లింగాల మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం లింగాల మండల కేంద్రానికి చెందిన విశ్వనాథ శంకరాచారి(55) అనే వ్యక్తి గత రెండు నెలలుగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడని తెలిపారు.20తారీఖు తిని పడుకున్న తర్వాత మరుసటి రోజు నుంచి ఇంట్లో కనిపించడంలేదని తెలిపారు. సోదరుని కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## కొండచిలువ పట్టివేత



కొండచిలువను బంధించిన కృష్ణ సాగర్

**వనపర్తి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలోని చిట్యాల పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న పాత ఇనుప సామాన్ గోదాంలో కొండచిలువ కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే మంగళవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో పాత ఇనుప సామాన్ గోదాం యజమాని తాజావుద్దీన్ తన గోదాములు సెటర్ ఓపెన్ చేయగా అకస్మాత్తుగా ఆరడుగుల కొండచిలువ కనబడడంతో భయాందోళనకు గురై వెంటనే తన స్నేహితుడు చిలుక కుమార్ సాగర్‌కి సమాచారం అందించారు. కుమార్ వెంటనే వనపర్తి జిల్లా కేంద్రంలోని సాగర్ స్నేక్ సొసైటీ చీర్ల కృష్ణసాగర్ కు సమాచారం అందించారు వెంటనే కొండచిలువ ఉన్న ప్రాంతానికి చేరుకొని సంచుల మధ్యలో నక్కి ఉన్న కొండచిలువను సురక్షితంగా బంధించడంతో వాహనదారులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం. కృష్ణ సాగర్ మాట్లాడుతూ బంధించిన కొండచిలువ 6 ఆరు అడుగులు, 8 కేజీల బరువు ఉంటుందని కొండచిలువను ఫారెస్ట్ అధికారుల సూచన మేరకు సురక్షితమైన అడవి ప్రాంతంలో వదిలేస్తామని తెలిపారు. కృష్ణ సాగర్ వెంట స్నేక్ సొసైటీ సభ్యులు కుమార్ సాగర్, అవినాష్ వున్నారు.

## గాయత్రీ దేవి అవతారంలో పర్వతాపూర్ మైసమ్మ దేవత



**నవాబుపేట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** అత్యంత ప్రాచుర్యం చెందిన నవాబుపేట మండల పరిధిలోని కాకర్లపాడు పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారు మంగళవారం గాయత్రీ దేవి అవతారం లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. పూజా కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది, చైర్మన్ జగన్మోహన్ రెడ్డి , కార్యనిర్వహణాధికారి నర్సింలు, ఆలయ రికార్డ్ అసిస్టెంట్ గోపాల్, ధర్మకర్త మండలి సభ్యులు, భక్తుల సమక్షంలో వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బందితో పాటు కాకర్లపాడు ప్రజాప్రతినిధులు, నరేందర్, పాశం రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## గున్ముక్లలో అన్నప్రసాద వితరణ

**ధన్వాడ, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** ధన్వాడ మండలంలోని గున్ముక్ల గ్రామంలో దుర్గామాతకు ప్రతిరోజు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. మహిళా భజన మండలి ఆధ్వర్యంలో రోజు భజనలు జరుగుతున్నాయి. దుర్గామాత విగ్రహ ప్రతిష్టించిన రోజు నుంచి నిమజ్జనం వరకు నిత్యం అన్నప్రసాద వితరణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, పిల్లలు పాల్గొన్నారు.

## ఘనంగా ధన్వంతరి జయంతి



**మహబూబ్‌నగర్, సెప్టెంబరు23,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యం లో ధన్వంతరిజయంతి వేడుకలతోపాటు 10వ ఆయుర్వేద దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ సురేష్ చౌహాన్, జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఆదిశేషయ్య, సీనియర్‌మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫహీంమార్గదర్శకత్వంలో కిషన్ నగర్‌లో ధన్వంతరి పూజ నిర్వహించి వైద్య శిబిరం ప్రారంభించారు.సుమారుగా 80మంది వరకు రోగులకు వైద్యులు పరీక్షించి ఆయుర్వేదమందులు అందజేశారు. కార్యక్రమంలో డా. సురేష్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యానికి మూలపురుషుడైనధన్వంతరిని పూజించే రోజుఅని,ఈపండుగ సందర్భంగా ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ధన్వంతరిని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆయుర్వేద నిపుణుడు డాక్టర్ చతుర్వేది, ఫార్మసిస్ట్ పట్టాబి, చంద్రయ్య, యోగా బోధకులు అన్వర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

## దసరాకు ఊరెళ్తున్నారా.. భద్రం

**వనపర్తి క్రైమ్, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** సీసీటీవీ కెమెరాల పనితీరును పరిశీలించండి. మీ సమాచారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఇవ్వండి.విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లో పెట్టడం మంచిదని ఇంటి తాళాలు మీతో పాటే తీసుకెళ్లండని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. సందర్భంగా ప్రజలకు పలు సూచన చేశారు..ఎక్కువ రోజులు ఊరెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వండి ఇంటి తాళాలు పూలకుండీలు, షూ రాక్స్, డోర్ మ్యాట్స్ కింద పెట్టొద్దు.. ఇంటి తాళాలు, విలువైన వస్తువులను మీ వెంటే తీసుకెళ్లండివాహనాలను ఇంటి ఆవరణలో పార్క్ చేయండి.. వాహనాల డిక్కీల్లో విలువైన వస్తువులను పెట్టకండి.. పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చుమని చెప్పాలి. ఇంటి డోర్కు సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకోండి.. సీసీ కెమెరాలను ఆన్లైన్ ద్వారా తరచూ పరిశీలించండి.. డివిఆర్ కనపడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశంలో పెట్టండి ఊరేళ్తున్న విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయొద్దు.. కొత్త వ్యక్తుల కదలికలను గుర్తిస్తే తక్షణమే 100 డయల్ చేసి సమాచారం ఇవ్వండి.. పోలీసులతో సమన్వయం ద్వారా చోరీల నియంత్రణ సులభం అవుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# డెంగీపై దృష్టి సారించాలి

(మొదటి పేజీ తరువాయి)

అధికారుల సహకారంతో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి వైద్య పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు ఎఎన్‌సి రిజిస్ట్రేషన్ శాతం పెంచాలనీ అదేవిధంగా 5వ ఎ.ఎన్.సి. చెకప్ సైతం నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.వసతి గృహాల్లో చదువుకుంటున్న అమ్మాయిల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈ విషయంలో ఆర్.బి.ఎస్.కే సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మధుమేహం వ్యాధి గ్రాస్తులను ముందుగానే గుర్తించడానికి హెచ్.బి. 1(సి) పరీక్షలు అధిక సంఖ్యలో నిర్వహించాలని సూచించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీనివాసులు, డిప్యూటీ డియంహెచ్ఒ డా. శ్రీనివాసులు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా రంగారావు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు డా. చైతన్య, డా. సాయినాథ్ రెడ్డి, డా.పరిమళ, డా. మంజుల, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# వెల్టూర్‌లో శిథిలావస్థకు చేరుకున్న సహకార సంఘ భవనం



వెల్టూరులో శిథిలావస్థకు చేరిన సింగిల్ విండో భవనం

**ఉప్పునుంతల, సెప్టెంబరు23 ప్రభాతవార్త:** మండలంలోని వెల్టూరు గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న సింగిల్ విండో భవనాన్ని మరమ్మతులు చేపట్టి పునః ప్రారంభించాలని ఆ ప్రాంత వాసులు, గ్రామస్తులు కోరుతున్నారు.గతంలో ఉప్పునుంతల మండలంలోని తూర్పు గ్రామాలకు అణువుగా ఉన్న వెల్టూరు గ్రామంలో సింగిల్ విండో కార్యాలయం కార్యకలాపాలు కొనసాగాయి.దాదాపు 30 సంవత్సరాల క్రితం వెల్టూరు తో పాటు పెద్దాపూర్ సహకార సంఘం ను రద్దు చేస్తూ ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం కార్యాలయానికి విలీనం చేశారు. వెల్టూరు గ్రామంలో సింగిల్ విండో కార్యాలయం కోసం భవనం నిర్మించారు. ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంనకువిలీనం చేసిన తర్వాత భవనంలో ఎటువంటి కార్యాలయ కార్యకలాపాలు నిర్వహించకుండా తాళం వేసి ఉంచడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. టిపిసిసి ఉపాధ్యక్షులు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని శిథిలావస్థకు చేరుకున్న వెల్టూరు సింగిల్ విండో భవనాన్ని మరమ్మతులు చేపట్టి ఇతర కార్యాలయాలకు ఉపయోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మరమ్మతులు చేపట్టే ప్రయత్నం చేయాలని గ్రామానికి చెందిన యువకులు గుద్దటి బాలరాజు, సమ్మద్, సయ్యద్, ఉప్పరి బాలరాజులు కోరారు.

# సాధనతో విజయం

- పాలమూరు విశ్వవిద్యాలయం వీసీ శ్రీనివాస్
- పీయూలో ఉత్సాహంగా కబడ్డీ సౌత్‌జోన్ ఎంపికలు



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న వీసీ శ్రీనివాస్

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయంలో సౌత్ జోన్ కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీలను మంగళవారం నిర్వహించారు. ఎంపికలను పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్, రిజిస్ట్రార్ పిరమేష్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదేర్ల కరుణాకర్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ప్రతిరోజు ప్రాక్టీస్ చేస్తూ సామర్థ్యాలు మెరుగుపరుచుకుని రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి పాలమూరు విశ్వవిద్యాలయానికి బంగారు పథకాలు సాధించి పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్‌బాబు మాట్లాడుతూ క్రీడలు మనిషికి కేవలం విజయాన్నే కాకుండా పట్టుదల, జట్టుతో కలిసి పనిచేసే నైపుణ్యం వంటి విలువలను నేర్పిస్తాయన్నారు. ప్రతి మ్యాచ్‌ను, ప్రతి క్షణాన్ని, మీ ప్రతిభను నిరూపించుకునే అవకాశంగా భావించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యభాస్కర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పై శ్రీనివాసులు, మహబూబ్‌నగర్ జిల్లా కబడి అసోసియేషన్ ప్రెసిడెంట్ కురుమూర్తి, వివిధ కాలేజీల కబడ్డీ క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దాడి చేయడం బాధాకరం



గ్యాబ్రియల్‌ను పరామర్శిస్తున్న నాయకులు

**జడ్చర్ల,సెప్టెంబరు23,ప్రభాతవార్త:** జడ్చర్ల సమీపంలోని నక్షత్ర హోటల్ వద్ద జరిగిన గొడవలో గాయపడిన కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. హోటల్ దగ్గర జరిగిన గొడవలో గాయపడిన అమ్మాయి తండ్రి గ్యాబ్రియల్ జడ్చర్ల వంద పడకల దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఆయనతోపాటు అడ్డుకోబోయిన వ్యక్తినిక్రలతో తీవ్రంగా కొట్టడంతో గాయాలపాలయ్యారు. ఈమేరకు బాధితులను దవాఖానలో పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఇలాంటి దాడులు జరగడం బాధాకరం అన్నారు. ఆడపిల్లలు బయట తిరగాలంటే ఇబ్బందులు పడే పరిస్థితి రావడం శోచనీయమన్నారు. అందరు చూస్తుండగానే అమ్మాయి కుటుంబీకుల దాడిచేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, కౌన్సిలర్ సతీష్. నాయకులు కరాటే శ్రీను, శేఖర్,వెంకటయ్య. రమేష్, ప్రవీణ్ ఉన్నారు.

# ముర్రుపాలు బిడ్డ ఆరోగ్యానికి సురక్షితం



మాట్లాడుతున్న న్యూ రెయిన్ బో స్టార్ ప్లే స్కూల్ ప్రిన్సిపాల్ సైదా అరీబా తన్వీర్

**కల్వకుర్తి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** జన్మించిన బిడ్డలకు 6 నెలల వరకు తల్లిపాలు తాగిస్తేనే బిడ్డల ఆరోగ్యం సురక్షితంగా ఉంటారని, పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని, తప్పనిసరిగా పుట్టిన పిల్లలకు ముర్రుపాలు తాగించడం మరువకూడదని న్యూ రెయిన్‌బో స్టార్ ప్లే స్కూల్ ప్రిన్సిపాల్ సైదా అరీబా తన్వీర్ పేర్కొన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని సుభాష్ నగర్‌లోని అంగన్వాడి కేంద్రాన్ని న్యూ రెయిన్ బో స్టార్ ప్లే స్కూల్ ప్రిన్సిపాల్ సైదా అరీబా తన్వీర్ సందర్శించి గర్భిణీ మహిళలకు, కిశోర బాలికలకు, బాలింతలకు పలు సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాలింతలు పుట్టిన బిడ్డల ఆరోగ్య రక్షణకై పౌష్టిక ఆహారం కలిగిన గుడ్లు, ఆకుకూరలు ఆహారంగా తీసుకోవాలని ఆమె సూచించారు. గర్భవతులు పుట్టబోయే బిడ్డల కోసం ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిచ్చేందుకు పోషక పదార్థాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్‌అలివేల, అనిత, సౌందర్య, సాబేరా, నసీంలు పాల్గొన్నారు.

# ఊట్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ సంబరాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

**ఊట్కూర్, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయ పండుగ బతుకమ్మ ఉత్సవాలు ఊట్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పూలతో నిండిన రంగురంగుల బతుకమ్మలతో ఆవరణ మొత్తం కళకళలాడింది. మహిళా సిబ్బంది సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పూలదండలతో, పాటలతో బతుకమ్మ చుట్టూ ఆడిపాడుతూ వాతావరణాన్ని ఆనందభరితంగా మార్చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. జయచంద్ర మోహన్, ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. షైలజా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డా.రామవత్ సంతోషి బతుకమ్మను ఆరాధించి, సిబ్బందికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పర్యవేక్షకులు విజయ్ కుమార్, నర్సులు, సహాయక నర్సింగ్ మిడ్వైవ్స్ (ఏఎన్ఎంలు), గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలు (ఆశా వర్కర్లు) ఉత్సవంలో చురుకుగా పాల్గొన్నారు.పాటలతో,నృత్యాలతో,పూలతో నిండిన బతుకమ్మలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణ పండుగ వాతావరణంలో కళకళలాడింది. మొదటి రోజు నుంచే ఉత్సవాలు ఉత్సాహంగా సాగడంతో రాబోయే రోజుల్లో మరింత సందడి కానుందని అధికారులు తెలిపారు.

# గోవులను రక్షించిన బజరంగ్ దళ్ నాయకులు



గోవులను రక్షించిన దృశ్యం

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు23 ప్రభాతవార్త :** నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ గ్రామసమీపంలో ద్వారక స్కూల్ ముందు ఉన్న వ్యవసాయ పొలంలోకి ఆటోలో గోవులను మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో తరలిస్తున్న వ్యక్తులను జాజాపూర్ బజరంగ్దళ్ నాయకులు అడ్డగించి ప్రశ్నించారు. దీంతో ఆటో డ్రైవర్ గోవులను తరలిస్తున్న వ్యక్తులను ప్రశ్నించగా వారు పొంతనలేని సమాధానం ఇచ్చారు.ఈ విషయాన్ని గమనించిన బజరంగ్ నాయకులు ఆటోలో ఉన్న గోవులతో ఆ గోవులను నారాయణపేట పోలీస్ స్టేషన్ కు తరలించి ఆ వ్యక్తులపై కేసు నమోదు చేయించారు. జాజాపూర్ బజరంగ్ దళ్ గ్రామ అధ్యక్షులు సురేష్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ నాయకుల సహకారంతో ఆ గోవులను గోశాలకు తరలించారు. బజరంగ్దళ్ నాయకులను నారాయణపేట జిల్లా బజరంగ్దళ్ కమిటీ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జాజాపూర్ గ్రామ బజరంగ్‌దళ్ కమిటీ సభ్యులు, గో సంరక్ష డి నరేష్ అయ్యప్ప బాలుతో పాటు నారాయణపేట జిల్లా గో సంరక్ష కమిటీ సభ్యులు సందీప్ శ్రావణ్ వెంకటేష్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాత్రి విగ్రహం పెట్టారు.. వేకువ జామున తొలగించారు!



ఏర్పాటుకు దిమ్మెపై ఉంచిన డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం

**లింగాల, సెప్టెంబరు23 ప్రభాతవార్త:** దళితుల ఆశాజ్యోతి రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమా నించిన సంఘటన నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండలం పద్మనపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పద్మనపల్లి గ్రామంలో కొంతమంది యువకులు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. లింగాల మండల కేంద్రంలోని నూతనంగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంతో, ఇదివరకు ఉన్న పాత అంబేద్కర్ విగ్రహం ఒక ప్రదేశంలో పెట్టారు. పద్మనపల్లి యువకులు లింగాలలో ఉన్న పాత అంబేద్కర్ విగ్రహాన్ని లింగాలకు చెందిన కొంతమంది అధికార పార్టీ నాయ కుల సలహా సూచనల మేరకు అంబేద్కర్ విగ్రహం తీసుకెళ్ళి ఏర్పాటుకు సిద్ధం చేశారు. ఇది గమనించిన కొంతమంది గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు జోక్యం చేసుకోవడంతో విగ్రహం ఏర్పాటు వివాదాస్పదంగా మారింది.దీంతో పోలీసులు రంగంలోకి దిగడంతో సద్దుమణిగింది. సోమవారం దిమ్మెపై అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు సిద్దం చేశారు. కానీ మంగళవారం తెల్లవారుజామున చూసేసరికి దిమ్మెపైఅంబేద్కర్ విగ్రహం లేకపోవడంతో గ్రామస్తులు నివ్వెర పోయారని ఆరోపించారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుకు సిద్దం చేసి తొలగించడంతో అంబేద్కర్‌ను అవమాన పరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## వచ్చే జూన్ నాటికి కరివెనకు కృష్ణా జలాలు

మొదటి పేజీ తరువాయి భాగం..

పాలమూరు జిల్లా రైతుబిడ్డ రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రఇరిగేషన్‌శాఖ చీఫ్ ఇంజినీర్ ఎ సత్యనారాయణరెడ్డి,ఎస్ఈ జగన్మోహన్‌రెడ్డి, డీఈఈలు అబుమాలిక్, విజయేందర్‌రెడ్డి,ప్రభాకర్‌రెడ్డిలతో పాటు ఈఈ దయానంద్ ఇతర అధికారులతో పాటు భూత్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందడి నర్సింహ్మారెడ్డి,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి,మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్,ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొల్గర నర్సింహులు,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌గౌడ్‌లతో పాటు ఇతర నాయకులు వడ్డె శ్రీనివాసులు, రవీందర్‌రెడ్డి, కిట్టురెడ్డి, టీవీ రెడ్డి,రాంరెడ్డి,మాసగౌడ్, తమన్న గౌడ్,నర్సింహులు,పర్వతాలు,వేణు,తిరుపతిరెడ్డి,మాధవరెడ్డి,దెంది లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ జిల్లాకు డిజిటల్ గ్రంథాలయాలు

మొదటి పేజీ తరువాయి భాగం..

నియోజకవర్గాల గ్రామాల్లో ఏర్పాట్లు కానున్నాయని తెలిపారు. కల్వకుర్తి 8,కొల్లాపూర్ 7,నాగర్‌కర్నూల్7, అచ్చంపేట 7 ఇప్పటికే 29 డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటు ప్రక్రియకు మంజూరు లభించిందని కలెక్టర్ పేర్కొన్నారు.గ్రంథాలయాల అభివృద్ధికి స్థలాల సేకరణ నిర్మాణాలు ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులు వేగవంతంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణానికి కావలసిన వసతులు, మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యంఉండకూడదని స్పష్టం చేశారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు పర్యవేక్షణ చేసి పనులు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు.డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటు వల్ల గ్రామీణ విద్యార్థులు సరికొత్త సాంకేతిక సదుపాయాలతో విద్యనభ్యసించగలరని, ప్రజలు సమాజంలో చైతన్యం, విజ్ఞానం పెంపొందించుకోవచ్చని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, డిప్యూటీ సీఈఓ గోపాల్‌నాయక్, సిఎస్ఆర్ నిధులు సమకూర్చే బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

**అయిజ సెప్టెంబర్ 23, ప్రభాతవార్త;** మండల పరిధిలోని చిన్న తాండపాడు గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం పోలీసులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం గ్రామంలోని మంగళ కృష్ణమూర్తి పాడుబడిన గృహ ముందు పేకాట ఆడుతున్నారన్న సమాచారం వచ్చిందని వెంటనే ఆ స్థావరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను పట్టుకున్నామని అలాగే వారి నుండి ఆరు సెల్ ఫోన్లు 15,730 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

## ప్రధాని మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం



**రాజాపూర్, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జీఎస్టీ ప్రతిఫలాలు భారత దేశం మొత్తంలో అన్ని ధరలు తగ్గించడం తగ్గిన ధరలు సోమవారం నుండి అందరికి అందుబాటులోకి రావడం పట్ల మంగళవారం ఉదయం బిజెపి నాయకులు రాజాపూర్ మండల కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు కాటేపాగ ఆనంద్ మాట్లాడుతూ.. దసరా కానుకగా పేద, మధ్యతరగతి ప్రజలకు నిత్యవసర వస్తువులు ఎలక్ట్రానిక్ వస్తువులు కార్లు, కంప్యూటర్లు ఇలా ప్రతి దాని పైన కూడా ధరలు తగ్గించినందుకు నరేంద్ర మోడీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలోభారతీయ జనతాపార్టీ నాయకులుకార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యాపారం కోసం వెళ్తూ మహిళ మృతి

**అలంపూర్ సెప్టెంబర్23 ప్రభాతవార్త:** అలంపూర్ మండల పరిధిలోని లింగన్న బొంతల వ్యాపారం కొరకు వెళుతున్న ఓ మహిళ మృతి చెందిన సంఘటన వివరాలను అలంపూర్ ఎస్ఐ వెంకటస్వామి వివరించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం, 23 వ తేదీనాడు పెబ్బేరు మండలానికి చెందిన గోపాల్ అతని భార్య నాగమణి (48) సంవత్సరాలు, బొంతల వ్యాపారం కోసం వారి బైక్ మీద లింగం వైగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో లింగన్వాయ్ గ్రామ బయట ఉన్న టవర్స్ దగ్గర ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ టక్కర్ ఇవ్వడంతో బైక్ మీద వెనకాల కూర్చున్న నాగమణి కిందపడి చనిపోయినదని తెలిపారు. ఇట్టి విషయమై ఋతురాలు బస్తాయన గోపాల్ చేసిన ఫిర్యాదు మేరకు ఉట్కూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సమీర్ పై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

## కల్వకుర్తి పీడీఎస్‌యూ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

**కల్వకుర్తి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో పట్టణ కమిటీని పిడిఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులుసంతోష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కల్వకుర్తి పట్టణ అధ్యక్షుడిగా వి.కార్తీక్ (హుస్నాబాద్ ఐటీఐవిద్యార్థి), ప్రధాన కార్యదర్శిగా అనిల్ (మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థి), ఉపాధ్యక్షులుగా అరవింద్, సహాయ కార్యదర్శిగా విశాంత్, కమిటీ సభ్యులుగా ఆదిత్య, శివలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**అలంపూర్ సెప్టెంబర్23, ప్రభాతవార్త:** ఉండవెల్లి మండల పరిధిలోని మంగళవారం పుల్లూరు టౌన్ ప్లాజా సమీపంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును బ్లూ కాల్ టు కానిసేబుల్ పట్టుకున్నారు. ఉండవెల్లి ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ 21 టీ వై 1724 నెంబరు గల ట్రాక్టర్ లో మంగళవ్వార కర్నూలు జిల్లా దినదేవరపాడు నుంచి అలంపూర్ చౌరస్తా వైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్ను బ్లూకాల్‌టు విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రవిఅనిల్ పట్టుకున్నారు. టోల్గేట్ సమీపంలోని అతిథి హోటల్ దగ్గర మధ్యాహ్నం అందాజ 12 గంటలు 45 నిమిషాలకు కర్నూలు వైపు నుండి అలంపూర్ చౌరస్తా వైపు ఒక ట్రాక్టర్ ఇసుకలోడుతో రాగాట్రాక్టర్‌ని ఆపి తనిఖీ చేసి ఇసుకను తరలించుటకుఅనుమతి పత్రాలు అడగగా డ్రైవర్ తెలిపినది ఏమనగా తన పేరుబోయ మధువెంగన్నబాయ్ గ్రామం దిన్నెదేవరపాడు కర్నూలు జిల్లా ఇసుకను తుంగభద్ర నదిలో ట్రాక్టర్లో నింపుకొని అక్రమంగా దొంగతనంగా అలంపూర్ చౌరస్తాలో ఎక్కువ ధరలకు అమ్మి లాభ పడాలని ఇసుకను తరలిస్తుండగా పోలీసు వారు పట్టుకున్నారు. ఇది అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ పై చట్టరీత్య చర్య గురించి దరఖాస్తు చేయగా ఉండవెల్లి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడమైనది.